ప్రజాశక్తి

ఆదివారం 16 మార్చి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పింఛన్లు మంజూరు చేయాలి

◆ కొత్తవి ఇవ్వడంలో జాప్యమేలా ? ◆ జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో పలువురు జెడ్‌పిటిసిలు



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖ జిల్లాలో అర్హత కలిగిన వారందరికీ కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని పలువురు జెడ్‌పిటిసిలు డిమాండ్ చేశారు. ముఖ్యంగా వితంతు పింఛన్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పింఛన్ల మంజూరుకు వెంటనే చర్యలు చేపట్టాలని పట్టుబట్టారు. శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్‌లో 1 నుంచి 7 వరకూ గల స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొత్త పింఛన్లు మంజూరుపై ప్రస్తావన వచ్చింది. దీనికి డిఆర్‌డిఎ ప్రభుత్వానికి ఈసరికే నివేదికలు పంపిందని, మంజూరైన వెంటనే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. దేవరాపల్లి జెడ్‌పిటిసి సభ్యురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ గొర్రెలు, మేకల మీద ప్రభుత్వం అమలు జరుపుతున్న స్కీములను తెలియజేయాలన్నారు. వాటికి ఛైర్‌పర్సన్ సుభద్ర బదులిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా గ్రామీణ ప్రాంతంలో అర్హులైన పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం మంజూరు చేయాలని, పక్కా గహాలు ఇవ్వాలని కొందరు సభ్యులు కోరారు. దీనికి హౌసింగ్ శాఖ అధికారులు బదులిస్తూ ప్రస్తుతం సర్వేలు జరుగుతున్నాయని, సర్వే పూర్తయిన వెంటనే లబ్ధిదారులను గుర్తిస్తామని తెలిపారు. కెజిహెచ్‌లో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహణలో జాప్యం జరుగుతోందని ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రస్తావించగా కెజిహెచ్ నుంచి హాజరైన ప్రతినిధి మాట్లాడుతూ మిగతా 2లో..



హాజరైన జెడ్‌పిటిసిలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు, చిత్రంలో లోకనాథం, జగ్గునాయుడు

ప్యాకేజీ పేరుతో మోసం

◆ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఒరిగిందేమీ లేదు
◆ అది బ్యాంకుల అప్పులకే తప్ప కర్మాగార రక్షణకు కానేకాదు
◆ ప్రైవేటీకరణ విరమించి ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి
◆ సొంత గనులు కేటాయించాలి
◆ సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

వార్త మెయిన్‌లో..

చర్లపల్లి మీదుగా పలు రైళ్లు మళ్లింపు

▶ వార్త 2లో..

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

▶ వార్త 7లో..



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

భూసేకరణ ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం నిర్దేశించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలో చేపట్టనున్న రైల్వే, హెచ్‌పిసిఎల్, ఇరిగేషన్, విద్యుత్, ఐఒసిఎల్, జాతీయ రహదారులు, అంతర్గత రోడ్లు తదితర ప్రాజెక్టులపై జెసి, డిఆర్‌ఒలతో కలిసి కలెక్టర్ శనివారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో సమీక్ష నిర్వహించారు. నిర్ణీత కాలంలో అవసరమైన భూములను సేకరించి నివేదించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బదిలీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు సిబ్బందిని బదిలీ చేస్తూ సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ - 4లో విధులు నిర్వహిస్తున్న పివిసిఎం ఎర్రమనాయుడును రెండో పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయనతోపాటు పిఎం.పాలెం లా అండ్ డాక్టర్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న టి.శ్యాం ప్రసాద్‌ను ఎంవిపి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరితోపాటు నగరంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది హెడ్ కానిస్టేబుళ్లను, ఇద్దరు వుమెన్ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సిపి ఉత్తర్వులు జారీ చేశారు. అవి తక్షణమే అమలులోకి వస్తాయని బదిలీలు పొందిన వారు వెంటనే ఆయా స్థానాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

బాలిక ఆత్మహత్య

- సెల్‌ఫోన్ చూడొద్దని మందలించడమే కారణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెల్‌ఫోన్ ఎక్కువుగా చూడొద్దని కుమార్తెను తల్లి మందలించడంతో ఆమె మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది. ఎంవిపి సిఐ ఎన్.మురళి కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి నక్కవానిపాలెంనకు చెందిన పదో తరగతి చదువుతున్న బాలికను తల్లి మందలించింది. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఫోను ఎక్కువుగా చూడొద్దని వారించింది. మనస్తాపం చెందిన బాలిక తన తల్లి సమీపంలోని షాపునకు వెళ్లిన సమయంలో ఇంట్లో గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తులో ఉంది.

మొదటి పేజీ తరువాయి..

పింఛన్లు మంజూరు చేయాలి

పోస్టు మార్టం చేయాలంటే పోలీసు శాఖ వారు పంచనామా చేయాల్సి ఉంటుందని, తదుపరి మాత్రమే పోస్టుమార్టం చేయగలమని చెప్పారు. పంచనామా ఆలస్యంతో పోస్టుమార్టంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజల కోసం కెజిహెచ్‌లో ప్రత్యేకంగా వెయిటింగ్ హాలు నిర్మించామని, అన్ని సదుపాయాలూ ఉన్నాయని, గిరిజన ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్లపై సర్వేలు జరుగుతున్నాయని తెలియజేశారు. అరకు జెడ్‌పిటిసి శెట్టి రోషిని మాట్లాడుతూ కెజిహెచ్‌లో పేషెంట్ల హెల్త్ రికార్డు వివరాలు తెలుసుకోవడానికి హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. దీనికి కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద బదులిస్తూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ అప్డేట్ అవుతోందని, త్వరలోనే అవుట్ పేషెంట్‌ను ప్రతిరోజు చూసే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

అనకాపల్లిలో ప్రభుత్వ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు జాతీయ రహదారిపై ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని, అటువంటి ప్రమాదాలలో క్షతగాత్రులను విశాఖపట్నం వంటి దూర ప్రాంతంలోని కెజిహెచ్‌కు తరలించేలోపు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో అనకాపల్లిలో ప్రభుత్వ ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బదులిస్తూ ఇది ఎన్‌టిఆర్ వైద్య సేవలో ఉందని, త్వరలోనే కొత్త భవనాన్ని నిర్మించి ఇటువంటి సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని బదులిచ్చారు.

ఏజెన్సీలో అంబులెన్స్‌ల సమస్యలు

అరకు జెడ్‌పిటిసి రోషిని మాట్లాడుతూ తమ ప్రాంతంలో 108 అంబులెన్సులు సకాలంలో స్పందించటం లేదని, అందువల్ల గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదు చేశారు. ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతమైన పాడేరు మండలంలో 108 సౌకర్యం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఇది తమ దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐదో స్థాయి సంఘం ఛైర్‌పర్సన్ ఈర్లె అనురాధ మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం శాఖాపరంగా ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల డ్రాప్ అవుట్స్ పెరుగుతున్నాయని, వాటిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోటవురట్ల మండలం పందూరు సమీపంలో సిపిడబ్ల్యుఎస్ పథకానికి దగ్గరలో ఇసుక తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయని, అందువల్ల ఈ స్కీము ఎండిపోయే ప్రమాదం ఉందని, అనేక గ్రామాలకు మంచినీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు కలిగే వీలుందని కోటవురట్ల జెడ్‌పిటిసి తెలిపారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. అనకాపల్లి ఆర్‌ఇసిఎస్‌ను ఇపిడిసిఎల్‌లో విలీనం చేసిన తర్వాత సిబ్బంది నుంచి బయోమెట్రిక్ విధానం అమలు చేయడం లేదన్నారు. అందువల్ల పలువురు ఉద్యోగులు విధులకు హాజరుకాకుండానే జీతాలు తీసుకుంటున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఎపిడిసిఎల్ డైరెక్టర్‌ను కోరారు. ఈ సమావేశాల్లో మూడు జిల్లాల జెడ్‌పిటిసిలు, జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పి పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి సమావేశాలను నిర్వహించారు.

చర్లపల్లి మీదుగా పలు రైళ్లు శాశ్వత మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు రైళ్లను శాశ్వత ప్రాతిపదికన చర్లపల్లి వద్ద అదనపు స్టాప్‌లతో చర్లపల్లి -అమ్ముగూడ - సనత్ నగర్ మీదుగా వయా చర్లపల్లి - మౌలాలీ జి.క్యాబిన్ -దయానంద్ నగర్ బైపాస్ క్యాబిన్ (బైపాస్ సికింద్రాబాద్)లో దారి మళ్లించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో 18520 లోకమాన్య తిలక్ టెర్మినల్ - విశాఖపట్నం రైలు ఏప్రిల్ 22 నుంచి, 18519 విశాఖపట్నం - లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 18503 విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24 నుంచి, 20809 సంబల్పూర్-నాందేడ్ ట్రై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 18504 సాయినగర్ షిర్డీ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి, 20810 నాందేడ్- సంబల్పూర్ ఎక్స్‌ప్రెస్, 20811 విశాఖపట్నం-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుంచి, 20812 నాందేడ్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 27 నుంచి మళ్లించిన మార్గంలో నడుస్తాయి. కావున ఈ రైళ్లు భవిష్యత్తులో సికింద్రాబాద్ మీదుగా ప్రయాణం చేయవు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అధికారులు కోరారు

లిహూరి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్

వాల్తేరు డివిజన్‌లోని నౌపడ-గుణుపూర్ మార్గంలో ఉన్న లిహూరి స్టేషన్ వద్ద మార్చి 15 నుంచి 23 వరకు జరిగే డోలో యాత్ర ఉత్సవం సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు లిహూరి స్టేషన్‌లో రెండు నిమిషాల తాత్కాలిక హాల్ట్‌ను ఇవ్వనున్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

టైం బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యక్రమాల అమలుకు చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమయం విలువను, ప్రాముఖ్యతను తెలుపుతూ టైం బ్యాంక్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే కార్యక్రమాల అమలుకు విశాఖపట్టణం పైలట్ జిల్లాగా ఎంపికయ్యిందని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి జె.మాధవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టైం బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక ఛైర్మన్ పిసి జైన్ తమ కార్యక్రమాలను అమలు చేయడానికి జిల్లాను ఎంపిక చేశారని, ఆ మేరకు ఈ నెల 18న జిల్లా పరిషత్ సమీపంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నామని వెల్లడించారు. డబ్బును కాదు, సమయాన్ని జమ చేస్తాం అనే అంశంపై సూచనలు, సలహాలు ఉంటాయని, చర్చ సాగుతుందని ఆమె తెలిపారు. పిసి జైన్, ఇతర ప్రతినిధులు పాల్గొని వివిధ అంశాలపై మాట్లాడతారని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలి

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఐక్య పోరాటాలతో కార్మికవర్గం, ప్రజలు కాపాడుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్లాంట్‌ను కాపాడుతామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ఏమైందని కూటమి నేతలను ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని రాఘవులు శనివారం సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపుతూ మాట్లాడారు. అన్ని విధాలుగా ప్లాంట్ కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్‌ఎస్ పేరుతో శాశ్వత కార్మికులను బయటకు పంపిస్తున్న ప్రభుత్వం మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులను తొలగించుకుంటూ ముందుకెళ్తోందన్నారు. ఇదంతా ప్రైవేటీకరణలో భాగంగానే జరుగుతోందని తెలిపారు. ప్యాకేజీ పేరిట డ్రామాలు నడుస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ భూములను కొల్లగొట్టేందుకు అదానీలాంటి వారు కాపుకాచుకుని ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులంతా ఐక్యంగా ఉండి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. వారికి రాజకీయ పార్టీలు నిజాయితీగా సహకరించాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించటం లేదని పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు, జె.అయోధ్యరామ్, వైటి.దాస్, యు.రామస్వామి, డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, రమణమూర్తి, జె.రామకృష్ణ, పి.శ్రీనివాసరాజు, సుబ్బయ్య, సిహెచ్.సన్యాసిరావు, వరసాల శ్రీనివాస్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బి.అప్పారావు, కె.గంగాధర్, టివికె.రాజు, మరిడయ్య, పుల్లారావు, నీలకంఠం, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాస్, నమ్మి రమణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాఘవులు 'విశాఖ ఉక్కుకు ఊతమివ్వని ప్యాకేజీ' పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ఉక్కు దీక్షా శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న బివి.రాఘవులు

ఉక్కుపై సాగుతున్న కూటమి మోసం..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి' అన్న సామెతను గుర్తుకు తెచ్చేలాగ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన వ్యవహారం 'ఉక్కు' విషయంలో ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. రూ.11440 కోట్లును ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చేశాం, ఇంకేం కావాలంటూ చెప్పిన మాటలు ఉత్తివేనని తెలుసుకోవడానికి కార్మికవర్గానికి ఎంతోసేపు పట్టలేదు. ప్యాకేజీ విషయంలో కేంద్రం మార్గదర్శకాలు దారుణంగా ఉన్నాయి. ప్యాకేజీ డబ్బుతో ప్లాంట్ మెయింటినెన్స్ పనులు చేయకూడదు. రా మెటీరియల్ కొనడం, కార్మికుల జీతాలకు వినియోగించడం చేయరాదు. దీంతో అసలు మోసం ఏమిటో బట్టబయలైంది. ఈ ప్యాకేజీతో సమస్య మొత్తాన్ని పరిష్కరించేశాం అన్న రీతిలో టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గొప్పగా ప్రచారం చేసుకుంటూ రాష్ట్రంలో ఆయా పార్టీల శ్రేణులతో సంబరాలు చేయించారు. 2024 సాధారణ ఎన్నికలకు ముందు 'విశాఖ స్టీల్' రాజకీయ రంగంలో పెద్ద అజెండా అయి ఎన్నికల సభల్లో టిడిపి, వైసిపి, జనసేన, బిజెపి నేతలు హామీల వర్షం గుప్పించారు. తాము గెలిస్తే ప్లాంట్‌ను రక్షించి తీరుతామని, ప్రైవేటీకరణ ఆపుతామని పెద్ద పెద్దమాటలు వల్లెవేశారు. ప్రజాగళం పేరుతో టిడిపి, జనసేన విడుదల చేసిన ఉమ్మడి మ్యానిఫెస్టోలోనూ ఆ విషయాలు ఉన్నాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా విశాఖ స్టీల్‌ను కాపాడతాం, ఆ శక్తి మాకే ఉందంటూ స్థానిక నేత నుంచి రాష్ట్ర స్థాయి నేతలంతా ఊదరగొట్టారు.

అసలేం జరిగింది? ఏం కొనసాగుతోంది ?

100 శాతం విశాఖ స్టీల్‌ను వ్యూహాత్మక సేల్ చేసి తీరుతామని మోడీ సర్కారు చేసిన ప్రకటనకు 2025 జనవరి 27తో నాలుగు సంవత్సరాలు దాటింది. 2025 ఫిబ్రవరి 12 నాటికి ప్రైవేటీకరణ వ్యతిరేక ఆందోళనలను కార్మికులు చేపట్టి నాలుగేళ్లు నిండాయి. సమస్య మాత్రం యథాతథంగానే ఉందన్నది ఎవ్వరూ కాదనలేనిది. సొంత గనులను కేటాయించలేదు. కాంట్రాక్టు కార్మికుల ఉపాధిపై కత్తి వేలాడుతూనే ఉంది. ఉద్యోగులు, కార్మికుల వేతనాల సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయాలని విశాఖ కార్మికవర్గమే కాదు రెండు తెలుగు రాష్ట్రాల సామాన్య ప్రజానీకం, మేధావులు కోరుతున్నా కేంద్రంలోని మోడీ సర్కారు కనీసం పట్టకుండా వ్యవహరిస్తోంది.

నమ్మించి గొంతు కోయడం కాదా!

రాష్ట్రంలోని కూటమి పాలకులైన తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్ర బిజెపికి వంతపాడుతూ వస్తున్న సంగతి కాదనలేని వాస్తవం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని ఎవరు చెప్పారంటూ కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకరేమిటి కూటమి పార్టీల్లోని నేతలంతా నమ్మబలుకుతూనే ఉన్నా మోడీ ద్వారా పార్లమెంట్‌లో లేదా పార్లమెంట్ బయటగానీ ప్రైవేటీకరణ చేయడం లేదన్న ప్రకటన చేయించడం లేదు. ప్యాకేజీ పేరుకే తప్ప నిజాయితీగా విశాఖ స్టీల్‌ను ప్రభుత్వరంగంలో నడపడానికి కాదన్నది తాజా పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల్లేనందున పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధ్యం కావడం లేదని, సెయిల్‌లో విలీనం చేయాలని కార్మికవర్గం కేంద్రం ముందు డిమాండ్ పెట్టినా సర్కారుకు పట్టడం లేదు. అనకాపల్లిలో ఏర్పాటు కాబోయే ఆర్సెల్లార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ఫ్యాక్టరీకి మాత్రం గనులు కొరత లేకుండా చెయ్యాలని 'కూటమి' నేతలు తెగ తాపత్రయ పడడం చూస్తే కమీషన్ల కక్కుర్తిలో త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కుకు ద్రోహం తలపెట్టడానికి వెనుకాడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



మొక్కుబడిగా మండల సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ప్రజాశక్తి -ఆనందపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ సమావేశం మొక్కుబడిగా సాగింది. మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రావడంతో పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు అటువెళ్లడంతో సర్వసభ సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేక వెలవెలబోయింది. కొన్నిశాఖల అధికారులు మాత్రమే హాజరై ఎజెండా వారీగా శాఖలవారీ నివేదికలు, వివరాలు వెల్లడించడంతో మొక్కుబడి తంతుగా ముగిసిపోయింది. సమావేశంలో ఎంపిడిఒ డాక్టర్ బి జానకి. వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, వెల్లంకి, ముకుందపురం, బిపి.కల్లాలు సర్పంచ్‌లు ఉప్పాడ లక్ష్మణరావు,కలిమి గంగరాజు, కోన పైడిరాజు శ్రీను పాల్గొన్నారు

నాలుగు కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-పద్మనాభం : ఈనెల 17 నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలకు మండలంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ పి.రమణ తెలిపారు. మండలంలోని రెడ్డిపల్లి, ఆర్‌వి పురం, పద్మనాభం, మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్ష కేంద్రాలో 711మంది రెగ్యులర్ విద్యార్థులు, 175 మంది ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులు మొత్తంగా 886 మంది పరీక్షలు రాస్తారన్నారు. ఇప్పటికే టెన్త్. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్, వైద్యం ఇతర అన్ని సదుపాయాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం: సత్యసాయి ఆదర్శ గ్రామం గొట్టిపల్లి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరం బాల వికాస్ విద్యార్థులకు, అలాగే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు శనివారం సత్య సాయి భజనమండలి సీనియర్ సేవాదళ్ కొట్యాడ లక్ష్మణమూర్తి సహాయ సహకారాలతో స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రిని హెచ్ఎం బంటు అప్పారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి గ్రామ కోఆర్డినేటర్ దబ్బీరు విజయ్‌కుమార్, భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్ము నాయుడు, కో కన్వీనర్ డిపిజెఎస్‌వి రత్నం, బాల వికాస్ కోఆర్డినేటర్ డబ్బీరు వెంకట సంతోష్ కిరణ్, వత్సవాయి కృష్ణమూర్తి రాజు, డి కార్తీక్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన న్యాయ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ :విశాఖ కేంద్రకారాగారాన్ని ఎన్‌బిఎం న్యాయ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. న్యాయ విద్యార్థుల ఆఖరి సంవత్సరం కరిక్యులమ్‌లో భాగంగా 48 మంది విద్యార్థులు కేంద్రకారాగారాన్ని సందర్శించినట్లు కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి మహేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా కారాగారంలో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, జైలు అధికారులు, సిబ్బంధి విధులు, పరిపాలనా విభాగం పనితీరుపై చర్చించారు. కార్యక్రమంతో జైలు ఉప పర్యవేక్షణాధికారులు సాయి ప్రవీణ్, కె.జవహర్ బాబు, సి.హెచ్.సూర్య కుమార్, జైలర్లు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్.విష్ణుమూర్తి మాట్లాడుతూ, తమ హక్కులు, చట్టాలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని, కొన్న వస్తువులు నాణ్యతగా లేవని భావిస్తే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- రేపటి నుంచి 31 వరకు రోజు విడిచి రోజు నిర్వహణ
- 134 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 29,997 మంది
- రెగ్యులర్‌తోపాటు సార్వత్రిక విద్యార్థులకు ఒకేసారి పరీక్షలు
- డిఇఒ ప్రేమ్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈనెల 17 నుంచి 31 వరకు నిర్వహించనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలోని అర్బన్ ప్రాంతంలో 98, గ్రామీణ ప్రాంతంలో 56 మొత్తంగా 134 కేంద్రాల్లో 28,023 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1404మంది ఓపెన్ విద్యార్థులు కలిపి మొత్తం 29,997 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. వీరిలో బాలలు 15,094 మంది, బాలికలు 13,429 మంది ఉన్నారని తెలిపారు. ఓపెన్ స్కూలు విభాగంలో విద్యార్థులు 15 కేంద్రాల్లో 938 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. రెగ్యులర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.30గంటల నుంచి 12.45 గంటల వరకు, ఓపెన్ విద్యార్థులకు ఉదయం 9.30గంటల నుంచి 12.30 గంటలవరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కాంపోజిట్, ఒకేషనల్ కోర్సులకు ఉదయం 9.30గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుందన్నారు. 265 మంది పిహెచ్ విద్యార్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లో పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. విద్యార్థులు అర గంట ఆలస్యమైనా పరీక్షకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఒకే విద్యార్థి రెండు సార్లు ఆలస్యంగా వస్తే పరీక్షకు అనుమతి ఉండదని తెలిపారు.

134 పరీక్ష కేంద్రాలకు 134 మంది చీఫ్ సూపరింటెండెట్లు, 134 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లుతో పాటు 1472 మంది ఇన్విజిలేటర్లు నియమించినట్లు తెలిపారు. ఈ ఏడాది మొట్టమొదటి సారిగా రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఓపెన్ స్కూలు విద్యార్థులకు కూడా ఒకే కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రతి కేంద్రంలో ప్రశ్నా పత్రాలకు క్యూ ఆర్ కోడ్ ఉంటుందని,ఒక వేళ పేపర్ లీక్ అయితే ఏ కేంద్రం నుంచి లీకైందో తెలిపోతుందన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. ఆరు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం వినియోగించుకోవచ్చని తెలిపారు. పరీక్షకేంద్రాల్లోకి ఎటువంటి ఎలాక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు అనుమతించబడవన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

ఆదివాసీ మహిళలకు 'గీతం' స్వయం ఉపాధి శిక్షణ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలిలో వివిధ గ్రామాల ఆదివాసీ మహిళలకు స్వయంఉపాధికి వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. గీతం బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు షీలా, డాక్టర్ కృష్ణ కుమారి, డాక్టర్ శ్రీలలిత సాగి పాల్గొని మహిళలకు స్థానికంగా లభించే ఆకులతో ప్లేట్లు, ఇతర సామగ్రి తయారీపై నైపుణ్య శిక్షణ అందించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ షీలా మాట్లాడుతూ, ఆదివాసీ మహిళలకు విలువైన వ్యాపార నైపుణ్యాలను నేర్పించడంతో పాటు, వారికి స్థిరమైన ఆదాయాన్ని సంపాదించడానికి, వారి జీవన ఉపాధిని మెరుగుపర్చడానికి శిక్షణ ఉపకరిస్తుందన్నారు. శిక్షణ అనంతరం స్థానిక మహిళలు తక్షణమే ఉత్పత్తులు తయారు చేయడానికి వీలుగా హత్తాగూడ, తురగూడ, కరైగూడ, చినాలుగూడ గ్రామాల మహిళలకు ఆకులతో ప్లేట్లు తయారు చేసే యంత్రాన్ని అందించారు.



ఆకులతో ప్లేట్ల తయారీ శిక్షణలో ఆదివాసీ మహిళలు

టొయోటా రేర్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ యంత్రాన్ని సిఎస్ఆర్ నిధులతో సమకూర్చింది. సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ మురళీధరరావు మాట్లాడుతూ, ఆదివాసీ మహిళల ఉపాధికి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, వ్యాపార కార్యక్రమాలను సులభతరం చేయడానికి ఈ యంత్రం ఉపకరిస్తుందన్నారు. గీతం బిజినెస్ స్కూల్ ఫ్యాకల్టీ సభ్యుల కృషిని అభినందించారు.

పేరుకుపోయిన మురుగుతో పరేషాన్!

- దుర్గంధంతో కాలనీవాసుల అవస్థలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం పంచాయతీ ఎస్‌సి, బిసి కాలనీల్లో అపారిశుధ్యం, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడే కాలువల్లో వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసన, దోమల బెడదతో అల్లాడిపోతున్నామని గ్రామస్తులు అంటున్నారు. కాలనీలో ఆరునెలలుగా పారిశుధ్య పనులు చేపట్టే పరిస్థితి లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఎవరి ఇంటి ముందు వారే శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ఖాళీప్రదేశాల వద్ద, కొందరు ఇళ్ల వద్ద కాలువలను శుభ్రం చేసే పరిస్థితి లేకపోవడంతో మొత్తానికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా,



కాలువలో పేరుకుపోయిన మురుగు



స్వచ్ఛందంగా కాలువ శుభ్రం చేసుకుంటున్న మహిళ

పట్టించుకోవడం లేదని, ఇక పారిశుధ్య సిబ్బందిని అడిగితే ఆరు నెలలుగా జీతాలు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్యం మరింతగా క్షీణించి, వ్యాధులు ప్రబలక ముందే పరిశుభ్రతా పనులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

బాలికపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి -గాజువాక : పదేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన ఘటన గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధి డ్రైవర్స్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి. డ్రైవర్స్ కాలనీలో కూరగాయల వ్యాపారం చేస్తు దాడి భానుప్రకాష్ అనే వ్యక్తి ఎదురింట్లో ఉన్న పదేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించారు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లడంతో ఇంటివద్దనే ఉన్న బాలిక వద్దకు వెళ్లి సిగరెట్టు వెలిగించేందుకు అగ్గిపెట్టె ఇవ్వాలని అడిగారు. తీరా అగ్గిపెట్టె తీసుకొచ్చాక ఇంట్లోంచి ఎప్పటికీ వెళ్లకపోవడంతో, తలుపులు వేసుకుంటాను బయటకు వెళ్లండని బాలిక అడిగింది. అలా చేయకపోగా, లోపలున్న బాలికపై అత్యాచారానికి యత్నించగా,ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలున్న వారు పట్టుకుని, భానుప్రకాష్‌ను పోలీసులకు అప్పగించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

కారు బోల్తా : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఆరిలోవ :జాతీయరహదారి హనుమంతువాక నుంచి వెంకోజీపాలెం వెళ్లే రహదారిలో శనివారం ఉదయం కారు బోల్తా పడింది. వెనుక నుంచి వస్తున్న టిప్పర్ లారీ బలంగా ఢీకొనడంతో కారు బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి ఘటనతో సుమారు గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగస్తులు విద్యాలయాలు, కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భీమిలి సిఐగా తిరుమలరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి సిఐగా బి.తిరుమలరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కొత్త సిఐ తిరుమలరావును స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సిబ్బంది సహకారం, సమన్వయంతో భీమిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు కృషి చేస్తానన్నారు.



సిఐ తిరుమలరావు

మొరాయించిన కంప్యూటర్

- జనన మరణ విభాగంలో కార్యకలాపాలకు ఇబ్బంది
- రెండు రోజులుగా గాజువాక జోన్‌లో నిలిచిన సేవలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయంలోని జనన మరణ విభాగంలో కంప్యూటర్ రెండురోజులుగా మొరాయించడంతో సేవలకు స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జోనల్ కార్యాలయం పరిధి పెద్దది కావడంతో ఇక్కడ జనన మరణ విభాగానికి వివిధ వార్డుల నుంచి రోజూ వందలాదిగా దరఖాస్తులు వస్తుంటాయి. జనన, మరణ వివరాల నమోదు, సర్టిఫికెట్ల జారీ, ఇప్పటికే నమోదైన జనన మరణ వివరాల్లో పేర్లు, తేదీల సవరణలు వంటి అనేక అంశాలపై దరఖాస్తులు వస్తుంటాయి. దీనికోసం రోజూ అనేకమంది జివిఎంసి జోనల్ కార్యాలయంలోని ఈ విభాగానికి అన్ని వార్డుల నుంచి ప్రజలు వస్తుంటారు. అయితే రెండురోజులుగా కంప్యూటర్ మొరాయించి పనులు జరగకపోవడంతో పనులు జరగక దరఖాస్తుదారులు పడిగాపులు పడక తప్పడం లేదు. కంప్యూటర్ మొరాయించి, జనన, మరణ విభాగంలో పనులు జరగకపోయినా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని దరఖాస్తుదారులు, స్థానికులు మండిపడుతున్నారు. దరఖాస్తుదారుల నుంచి పనులకు ఒత్తిడి రావడంతోపాటు ఎపుడు పనిచేస్తుందంటూ ప్రశ్నలు వస్తుండడంతోపాటు, అధికారుల నిర్లక్ష్యం, నిర్వాకంపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో ఈవిభాగంలోని సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురికాక తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, జనన మరణ విభాగంలో కంప్యూటర్‌ను బాగుచేయించి, సేవలను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

చంద్రంపాలెం పాఠశాల పూర్వవైభవానికి కృషి

• ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు • పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి- మధురవాడ : అభివృద్ధి, సంక్షేమంలో భీమిలి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం జివిఎంసి 6 వ వార్డులో రూ.3.29 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను విద్యాశాఖ మంత్రిగా చంద్రంపాలెం ఉన్నతపాఠశాలను రాష్ట్రంలోనే అత్యధిక మంది విద్యార్థులున్న పాఠశాలగా ఆదర్శంగా తీర్చిదిద్దానని, గడచిన ఐదేళ్లలో విద్యాప్రమాణాలు దిగజారిపోవడం తోపాటు డ్రగ్స్, గంజాయికి అడ్డాగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విద్యార్థుల మధ్య గ్రూపు గొడవలతో వీధికెక్కిన చంద్రంపాలెం పాఠశాలకు పూర్వవైభవం తెస్తున్నామన్నారు. జివిఎంసి పరిధిలో రూ.115 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ఐదేళ్ల వైసిపి పాలనలో నిర్లక్ష్యానికి గురైన కొమ్మాదిలోని అసంపూర్తి కళ్యాణమండపానికి రూ.80లక్షలు కేటాయించామన్నారు. 6వ వార్డు టిడిపి అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, గరే గుర్నాథ్ పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెంలో రూ.36.70లక్షలతో నిర్మించిన 30కిలోలీటర్ల ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు ప్రారంభం, సామాజిక ఇంకుడు గుంతల శంకుస్థాపనలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామంలోని హరిత రాయబారులను సన్మానించి, బియ్యాన్ని అందించారు. నేలతేరు కస్తూర్బా పాఠశాలలో మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ ట్రస్ట్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఆర్థిక సాయం రూ.తొమ్మిది లక్షలతో నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను ప్రారంభించారు కార్యక్రమంలో గంటా తనయుడు రవితేజ, డిపిఒ డి.శ్రీనివాస్, ఎంపిఇఒ డాక్టర్ వి.జానకి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, దాత సుభాష్‌చంద్రబోస్, ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, సర్పంచ్ల లోడగల రాజేశ్వరి రమణ , ఎంపిటిసి రౌతు శ్యామల, వెంకట్రావు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, కళాశాల ప్రిన్సిపల్ సత్య లావణ్య, కోరుకొండ శివాజీ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వైసిపిలో ఇక జగన్ ఏకాకి ఖాయం : గంటా

మధురవాడ : జగన్‌కు ఆత్మగా ఉంటూ జైలుజీవితాన్ని గడిపిన విజయసాయిరెడ్డి సైతం వైసిపిని వీడారంటే జగన్మోహనరెడ్డి వైఖరి ఎలాంటిదో స్పష్టమౌతోందని, రానున్న రోజుల్లో నేతలందరూ పార్టీని వీడి, జగన్ ఏకాకిగా మిగలడం ఖాయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికైనా జగన్ వైఖరి మార్చుకోకుంటే, వచ్చే ఎన్నికల్లో ప్రస్తుతమున్న 11 స్థానాల్లో ఒక్కటైనా మిగలడం కష్టమేనన్నారు. జగన్‌ను నమ్మి అవమానాలు పాలైన విజయసాయిరెడ్డి పార్టీని వీడితే, చంద్రబాబుపై ప్రేమ ఎక్కువైందని కువిమర్శలు చేయడం వైసిపి నేతల దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

రోడ్డు విస్తరించాలని ఐలా వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కలిసిన ఐలా చైర్మన్, ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ ఆర్చి నుంచి సెయిల్ జంక్షన్ వరకు రహదారి విస్తరణకు ఎంఎస్ఎంఇ నిధులు కేటాయించాలని లో ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సెక్రెటరీ చీకటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కొల్లి ఈశ్వరరావు కోరారు. శనివారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఆటోనగర్ ఆర్చి నుంచి సెయిల్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణకు రూ.12 కోట్లు ఖర్చు అవుతుందని ఇప్పటికే అంచనాలు వేశారన్నారు. సరిపడా రోడ్డు లేకపోవడంతో గాజువాక ఆటోనగర్‌లోని వివిధ పరిశ్రమలకు వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.దీనిపై కేంద్రమంత్రి రామ్మోహనరాయుడు స్పందించి, వెంటనే ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కమిషనర్‌తో ఫోనులో మాట్లాడారు. ఐలా విజ్ఞప్తి మేరకు రోడ్డు విస్తరణకు నిధులు విడుదల చేయాలని కోరారు

చిన్నారుల కేరింతలతో హోలీ సందడి



రంగులు పూసుకుంటూ సందడి చేస్తున్న యువతులు, చిన్నారులు

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రెండోరోజున కూడా హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్ద అందరూ హోలీ సంబరాల్లో పాల్గొని, పరస్పరం రంగులు పూసుకుంటే ఎంతో ఆనందంతో గడిపారు. హోలీ సంబరాలతో స్టేడియం ప్రాంగణమంతా రంగులమయమై ప్రత్యేక ఆకర్షణగా ఆవిష్కృతమైంది. హోలీవేడుకల్లో పాల్గొన్న వారితోపాటు వేడుకలను తిలకించిన వారు సైతం ఆనందోత్సవాల్లో మునిగిపోయారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యాన ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు శనివారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా ప్రాంతీయ నేత్ర వైద్యశాల నుంచి సత్యంజంక్షన్, రామాటాకీస్ మీదుగా మరలా నేత్ర వైద్యశాల వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని డిఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు అనంతరం ప్రాంతీయ నేత్రవైద్యశాలలో గ్లకోమా వారోత్సవాల ముగింపు సభలో ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం సంధ్యాదేవి మాట్లాడుతూ గ్లకోమా వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ప్రాంతీయ నేత్రవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి..స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించిన డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణిశ్రీలను అభినందించారు, కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎవి.రమణ, డాక్టర్ మాధవి, ఇంకా ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఎల్‌వి ప్రసాద్ హాస్పిటల్, గీతం మెడికల్ కాలేజీ, విశాఖ ఐ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెన్ స్కూల్ మినీ ఒలింపిక్స్



క్రీడా పతాకం ఆవిష్కరణలో అనిత పెరీరా

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి ఎనిమిదో వార్డు ఎండాడ పెన్ స్కూల్‌లో పెన్ మినీ ఒలింపిక్స్ పేరిట స్పోర్ట్స్ మీట్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. దేవరాపల్లి తహశీల్దార్ పొన్నగంటి లక్ష్మీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులతో తల్లిదండ్రులకు కూడా మినీ ఒలింపిక్స్ పేరుతో ఇలా ఆటలపోటీలు నిర్వహించి, వారిని ప్రోత్సాహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి మూడో తరగతి వరకు చిన్నారులకు పరేడ్, బ్యాలెన్సింగ్ రేస్, ఫ్లవర్ డ్రిల్, ఫిల్లింగ్ ద బాస్కెట్‌రేస్, మాస్ పీటి, ఫిల్ ఇన్ ది బాటిల్ రేస్, పోమ్ పోమ్ ఫ్యాన్సీడ్రిల్ వంటి ఆటల పోటీలు నిర్వహించగా, వారు ఉత్సాహంగా పాల్గొనడం ఆకట్టుకుంది.

కార్యక్రమంలో పెన్ స్కూల్ చైర్ పర్సన్ అనిత పెరీరా మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చదువుతోపాటు ఆటపాటల్లోనూ తర్ఫీదునిస్తున్నట్లు తెలిపారు చిన్నారులు మొబైల్స్‌కు దూరం కావాలంటే ఇలాంటి క్రీడలు ఎంతో అవసరమన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేంద్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఢిల్లీ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ నుంచి వచ్చిన కేంద్ర ప్రతినిధులు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు, బృందం సమీక్షించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఓ డాక్టర్ .పి.జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో జిల్లాను తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం మధ్యస్థం ఐదు విభాగాలుగా విభజించి, శొంఠ్యాం, ఆర్.తాళ్లవలస పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, రంగరాజువీధి, కొబ్బరితోట, వైద్య కళాశాల కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో డ్రిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్, ఎస్ఎన్‌సియు కేంద్రం, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె, టిబి కేంద్రాలు, ఘోషా ఆసుపత్రిలో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. డిపిఎంఒ డాక్టర్ ఉమాపతి, డిఇఐసి మేనేజర్ శాంతిప్రియ, డిటిసిఒ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం డిఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్.ఎన్.పూర్ణేంద్ర బాబు, ఆర్‌బిఎస్‌కె. జిల్లా సమన్వయకర్త డాక్టర్.హారికలతో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై విభాగాల వారీగా సమీక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం తుంగ్లాం, వంటిల్లు జంక్షన్ వద్ద 33/11కెవి విద్యుత్ లైన్ల అండర్ గ్రౌండ్ కేబులు పనులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. రూ.80కోట్లతో ఈపనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, కూటమి పాలనలో మౌలిక సౌకర్యాల కల్పన, అభివృద్ధి పరుగులు పెడుతోందని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలను చేపడతామన్నారు. కూటమి నాయకులు, ఎపిఇపిడిసిఎల్ అధికారులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులకు..

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి ఎల్లపువానిపురం శివారు ఎస్‌సి కాలనీలో రూ.19.62లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ శనివారం శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జివిఎంసి ఎఇఇ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణను కోరారు.



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకట రమేష్

ఇఫ్తార్.. ఆత్మీయతకు ప్రతీక

ప్రజాశక్తి - గాజువాక: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించే ముస్లిముల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. శనివారంగాజువాక కణితి రోడ్డులోని మదీనా మసీదు వద్ద మదీన యూత్ ఆధ్వర్యంలో ప్రార్ధనల్లో పాల్గొని, ఇఫ్తార్ విందు స్వీకరించారు. ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ .గాజువాక ప్రాంతంలో షాదీఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు..కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక సిఐ పార్థసారథి, మైనార్టీ నాయకులు ఐహెచ్ ఫారుఖి, ముస్లిం పెద్దలు రజీవుల్లా, షౌకత్ అలీ, ఆరీఫ్, పీర్ బాబా, మునవర్, మిస్బిన్, సలీమ్, ఆసిఫ్, మదీనావలి, మహ్మద్ రఫీ, బాలు నాయుడు పాల్గొన్నారు.

జూ పార్కులో ఆకట్టుకున్న రాప్టర్స్ ప్రదర్శన



సందర్శకులకు వివరిస్తున్న సిసిఎఫ్ శాంతిప్రియ పాండే

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జూ పార్కులో వింగ్స్ ఆఫ్ వండర్ రాప్టర్స్ ఎగ్జిబిషన్‌ను అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ శాంతిప్రియ పాండే, జూ క్యూరేటర్ జి.మంగమ్మతో కలిసి శనివారం ప్రారంభించారు. రాప్టర్స్ అద్భుత వైవిధ్యాన్ని, వాటి సంరక్షణపై అవగాహన పెంచడం లక్ష్యంగా నిర్వహించే ఈ ప్రదర్శనలో 60 రకాల రాప్టర్లను హైలెట్ చేస్తూ, పర్యావరణ ప్రాముఖ్యత, సంరక్షణ అవసరాన్ని వివరించడమే లక్ష్యంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సిసిఎఫ్ శాంతి ప్రియ పాండే మాట్లాడుతూ దేశంలో 100 కంటే ఎక్కువ రకాల రాప్టర్లుకు నివాస ప్రదేశాలు, పర్యావరణ సమస్యల కారణంగా తీవ్రమైన ముప్పు ఉంటున్నారు. రాప్టర్స్ మాంసాహార పక్షులని, అవి శిఖర గులాబీ జాతికి చెందినవన్నారు. ఇవి ఎలుకలను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషించడంతో పాటు మృత ప్రాణుల అవశేషాలను తొలగించడంలో సహాయ పడతాయన్నారు. అనంతరం విద్యార్థులతో రాప్టర్స్ అద్భుతాలు. రసాయనిక పురుగుల మందులు, ఎరువులు అతి విధ్వంసక వినియోగం వల్లవీటి మీద ఏర్పడుతున్న ముప్పుపై డాక్టర్ శాంతి ప్రియ చర్చించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్స్ బి.గోపి, పి.గోపాల నాయుడు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.భారతి, శ్రీహరి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రజా చైతన్య యాత్రలు

సిపిఎం నాయకుల వద్ద గోడు వెల్లబుచ్చుతున్న ప్రజానీకం



అనకాపల్లిలో పాడుబడిన నూతిలో అక్రమ బోర్‌వెల్‌ను చూపిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

ప్రజల నుండి సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయడానికి సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో జరుగుతున్నాయి.

అనకాపల్లి : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం సిపిఎం బృందం అనకాపల్లి దాసరిగెడ్డ రోడ్డు, ముత్రాస్ కాలనీలో పర్యటించారు. ముత్రాజ్ కాలనీ రామాలయం వద్ద పాడుబడిన నుయ్యిలో అక్రమంగా బోర్వెల్ వేసి దొంగ కరెంటు మీటర్ పెట్టి నీటిని నిబంధనలకు విరుద్ధంగా తరలించి అమ్ముతున్నారని స్థానికులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, గవరపాలెం శాఖ కార్యదర్శి పెంటకోట శ్రీనివాసరావు, కాళ్ల తేలయ్యబాబు మాట్లాడుతూ సీతారాముల వారి దేవాలయం భూమిని ఉపయోగించి అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పాడుబడిన నుయ్యి జనావాసాలు మధ్య ఉండటం వలన చెత్త వేయడం, మురుగు నీరు నిల్వ ఉండటం వలన దుర్వాసన కొడుతుందని, మూగ జీవాలు పడి మృతి చెందుతున్నాయని, చిన్నపిల్లల కూడా పడిపోయే అవకాశం ఉందని, వెంటనే ఈ నూతిని పూడ్చి వేయాలని కోరారు. కాలనీలో మూసివేసి డ్రైనేజీని వెంటనే ఏర్పాటు చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతా ఓంశివ, బొడ్డు శ్రీనివాసరావు, దూలం జగదీషరావు, దూలం త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు, ఎ.భీమవరం, పొడుగుపాలెం, మేడిచర్ల తదితర గ్రామాలలో సిపిఎం నాయకులు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఎ.కోడూరులో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింహాచలమ్మ, మల్లేటి నాగరాజుకు రూ.3000, మిగిలిన కార్మికులకు రూ.6000 వేతనాలు చెల్లిస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మున్నూరు పెంటమ్మకు వృద్ధాప్య పింఛను పునరుద్ధించాలన్నారు. ఎ.భీమవరం, మేడిచర్ల చెరుకు తూనిక కేంద్రం వద్ద చెరుకు రోజులు తరబడి ఎండలో ఎండి ఉంటున్నాయని, ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే ఫ్యాక్టరీ తరలించాలని కోరారు. చెరుకు రైతుల సమస్యపై గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఈనెల 21 తేదీన జరుగు ధర్నాకు రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గండి నాయన బాబు, ఎర్ర దేవుడు, ఈర్లే నాయుడు బాబు, వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.



రాంబిల్లి మండలం కొత్తపట్నంలో నినాదాలు చేస్తున్న స్థానికులు, సిపిఎం నేతలు

రాంబిల్లి : మండలంలోని కొత్తపట్నం మత్స్యకార గ్రామాన్ని సిపిఎం నాయకులు సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎఓబి నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ధోని కాసియా, నాగు మంత్రి నారాయణరావు, చోడుపిల్లి అప్పలరాజు, యూ అప్పారావు, సిహెచ్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కె.కోటపాడు మండలంలో ప్రజలతో మాట్లాడుతున్న దృశ్యం



ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

సాంకేతిక విద్యను విద్యార్థులు అందిపుచుకోవాలని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టెక్నికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసి క్యాంపస్ సెలక్షన్లో ఎంపికైన 120 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను శాసనసభ్యులు శనివారం అందజేశారు. రేబాక గ్రామంలో కాలేజీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టెక్నికల్ విద్యని అందుబాటులోకి తీసుకురావాలనే తలచి కసింకోట, అనకాపల్లి మండలాల్లో రెండు పాలిటెక్నిక్ కాలేజీలను ప్రారంభించామని గుర్తు చేశారు. గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో టెక్నికల్ విద్యను అభ్యసించి ఉద్యోగాలను పొందడం సంతోషదాయకమన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నామమాత్రం రుసుంతోనే సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. మధ్యతరగతి కుటుంబానికి చెంది ఎనిమిది లక్షల రూపాయలు ప్యాకేజీతో నియ్మామక పత్రం అందుకున్న డి.మల్లేశ్వరరావును, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ పాలిటెక్నిక్ కాలేజీకి రావడానికి రహదారి సరిగా లేకపోవడం గుర్తించి సీసీ రోడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 120 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చే విధంగా విధంగా కృషి చేసిన గురువులను సాలువలాతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం, అక్కిరెడ్డిపాలెం గ్రామం, తారకరామ కాలనీలో నిర్మించిన పాఠశాల భవనాన్ని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. తారకరామ కాలనీలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ సహకారంతో నిర్మించినట్లు చెప్పారు. ఎన్నో పోరాటాలు చేయడంతోనే పాఠశాల స్థలాన్ని వైకాపా పాలనలో కబ్జాదారుల నుండి కాపాడమన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ విద్యా బోధన కోసం ఎల్ఈడి స్క్రీన్లను కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాలకు 4,631 బయోమెట్రిక్ యంత్రాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

వివిధ రకాల సర్వేలు, సేవలు అందించేందుకు వీలుగా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలకు కొత్తగా 4,631 బయోమెట్రిక్ యంత్రాలు వచ్చినట్లు జిల్లా కో-ఆర్డినేటర్ ఉషారాణి తెలిపారు. జిల్లాకు వచ్చిన సంబంధిత యంత్రాలను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా శనివారం అందజేసినట్లు చెప్పారు. దీని ద్వారా సేవలను మరింత వేగవంతంగా అందజేసేందుకు, సాంకేతిక కార్యకలాపాలను త్వరగా నిర్వహించేందుకు వీలుపడుతుందని ఆమె పేర్కొన్నారు.



బయో మెట్రిక్ యంత్రాన్ని అందిస్తున్న విశాఖ కలెక్టర్

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ చోడవరం యూనిట్ కొత్త కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వీరణాల చినబాబు, గౌరవాధ్యక్షులుగా సిరికి దేవానంద్, వేగి మురళీకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా బి.దక్షిణామూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గండి వెంకటరావు, కోశాధికారిగా కె.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కురచా దేముడు, గొర్లి మూర్తి, బుగత కృష్ణ, సహాయ కార్యదర్శులుగా పి.రాజశేఖర్, టి.కష్ణమూర్తి వి.గోవిందరావు, కార్యనిర్వాహక సభ్యులుగా టి.సత్యం, కె.సింహాచలంనాయుడు, వి.రామచంద్రమూర్తి, కె.వెంకటరావు, ఎబివి.ప్రసాద్ ఎన్నికయ్యారు.

అగ్ని ప్రమాదంలో సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలో గల దిబిడి గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరు ఎకరాలకు పైగా సరుగుడు తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన ముమ్మిన నాగరాజు, పాతాళ శ్రీనివాసరావు, కందికొండ శ్రీను, సేనాపతి సూరిబాబు, సేనాపతి దేవుడమ్మ, బోధ అమ్మాజీ, మమ్మీన నూకరాజు తదితరులకు చెందిన సరుగుడు తోట కాలిపోయింది. విషయం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలు ఇతరులకు చెందిన తోటలకు వ్యాపించకుండా అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రెండు లక్షల పైగా ఆస్తి నష్టం వాటిల్లింది.



అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన సరుగుడు తోట

వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించాలి



మండల పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-కె.కోటపాడు : రైతులు వాణిజ్య పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించవలసిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఉందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడారు. ఈ సంవత్సరం చెరకు రైతులు తీవ్ర నష్టాల బారిన పడ్డారని, వారిని ఆదుకోవాలని చౌడువాడ ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ ఎమ్మెల్యేని కోరారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చే మొక్కజొన్న, కూరగాయలు, పూల సాగును చేపట్టాలని బండారు సూచించారు. మొక్కజొన్న రెండు మూడు నెలల్లో పంట చేతికొస్తుందని కంపెనీ ప్రతినిధులు నేరుగా పొలాలకు వెళ్లి మొక్కజొన్న కొనుగోలు చేస్తారని తెలిపారు. వీటితో భారీగా ఇథనాల్ తయారు చేయవచ్చన్నారు. విశాఖ నగరంలో బెంగుళూరు నుండి వచ్చే పూలకు మంచి డిమాండ్ ఉందన్నారు. స్థానిక రైతులు పూల సాగు చేపట్టినట్లయితే బెంగళూరులో కొద్ది రోజులు పాటు రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. మండలం నుండి సరఫరా అయ్యే కూరగాయల వల్లే 450 కోట్ల రూపాయల టర్నోవర్ జరిగిందని, అందువల్లనే జిల్లా కలెక్టర్ హార్టికల్చర్ హబ్‌గా ప్రకటించడం జరిగిందని తెలిపారు. దీనివల్ల ఉద్యాన సాగుకు వేలాది కోట్ల రూపాయలు సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో రైతులకు మామిడి జీడి నిమ్మ సపోటా డ్రాగన్ ఫ్రూట్ తదితర పండ్ల మొక్కలు ఉచితంగా అందిస్తున్నామని ఏపీఓ అప్పలరాజు వివరించారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటుతోపాటు మజ్జిగ అందించాలని ఎమ్మెల్యే బండారు సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, నీటిపారుదల, విద్యుత్, విద్యాశాఖ ఆరోగ్యం, రెవెన్యూ, పశుపోషణపై సంబంధిత అధికారులు వారి యొక్క నివేదికలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, ఎంపీడీవో సాంబశివరావు, తహసిల్దార్ రమేష్ బాబు, పలువురు ఎంపీటీసీలు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వినికిడి పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం వినికిడి సమస్యతో బాధపడుతున్న పలువురుకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. నూరు శాతం వినికిడి సమస్యతో ఇబ్బందులు పడుతున్న పలువురును ప్రముఖ ఆడియాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ వినికిడి పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి 20 వేల రూపాయలు విలువ చేసే వినికిడి యంత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతిరావు, సభ్యులు సూర్యరెడ్డి శ్రీనివాసరావు, మండల మురళీకృష్ణ, కన్నూరు అప్పలనాయుడు, ఆర్ దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు హాల్ టికెట్లు ఇస్తున్న డిఇఒ అప్పారావు నాయుడు

టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అనకాపల్లి జిల్లా విద్యాశాఖధికారి గిడ్డి అప్పారావు నాయుడు చేతుల మీదుగా శనివారం హాల్ టికెట్లు పంపిణీ చేసారు. శనివారం పాఠశాలను సందర్శించిన డిఇఒ మాట్లాడుతూ పరీక్షలు రాసేటప్పుడు తీసుకోవలిసిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థులు అందరూ అత్యధిక ఉత్తీర్ణ శాతం సాదించాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో అనకాపల్లి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాసాఖాధికారి -2 రవీంద్రబాబు ప్రధానోపాధ్యాయులు ఎస్. తిరుపతిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నువ్వు పంటను ఆశించిన పురుగు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : నువ్వు మొక్కలను పురుగులు తినేస్తుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రతి సంవత్సరం వరి పంటలు కోతలు అనంతరం జనవరి నెలలో నువ్వు విత్తనాలు చల్లుతారు. విత్తనాలు మొలకెత్తి పూత దశకు వచ్చి పంటపండి ఏప్రిల్ నెలలో పంట చేతికొస్తుంది. మండలంలోని తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట, హరిపాలెం తదితర గ్రామాలలో వందల ఎకరాలలో నువ్వు పంటను రైతులు సాగు చేశారు. ఏ చీడపీడలు ఆశించకుండా, పంట దిగుబడి బాగుంటే రైతులకు అధికంగా లాభాలు వస్తాయి. అయితే ఈ ఏడాది నువ్వు పంటను కంటికి కనిపించని పురుగులు తినేస్తున్నాయి. మొక్క దశలోనే పురుగులు తినేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక దిగుబడులు వస్తాయనుకున్న పంట పురుగుల తినేయడంతో దుక్కు, విత్తనాలు వంటి వాటికి పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు లబోదిబోమంటున్నారు. దీనిపై వ్యవసాయ అధికారిని సంప్రదించగా విత్తనాలు వేసే సమయంలో లేదా విత్తిన మొదటి వారం రోజుల్లో క్లోరోఫాస్ క్రిమిసంహారక మందు పిచికారీ చేయాలని సూచించారు.

17న విశాఖకు సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) 56వ స్థాపన దినోత్సవం సందర్భంగా 'సురక్షిత తీరాలు, సమృద్ధి భారతదేశం' అనే థీమ్‌తో చేపట్టిన దేశవ్యాప్త సైక్లోథాన్ 17న విశాఖకు రానుంది. భారత తీర ప్రాంతాన్ని పూర్తిగా చుట్టేలా ఈ సైకిల్ యాత్రను రూపొందించారు. హోం శాఖ మంత్రి అమిత్ షా మార్చి 7న తమిళనాడులోని అరక్కోణం నుండి ఈ సైకిల్ ర్యాలీని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సైక్లోథాన్ సోమవారం విశాఖకు చేరుకుంటుందని విశాఖ పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాలీకి సంప్రదాయ స్వాగతం అందించేందుకు బీచ్ రోడ్‌లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రత పట్ల అవగాహన కల్పించడం, ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు వంటి ముప్పులపై వారికి సూచనలు ఇవ్వడం ఈ సైక్లోథాన్ ప్రధాన లక్ష్యమన్నారు. 18వ తేదీన ప్రత్యేక సెండ్-ఆఫ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, ప్రధాన అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, విశాఖపట్నం పరిపాలనా అధికారులు, పోర్ట్ సిఐఎస్ఎఫ్ విభాగం సిబ్బంది పాల్గొంటారని వెల్లడించారు.

నూకాంబిక ఆలయ ఇఒగా రాంబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీనూకాంబిక ఆలయ సహాయ కమిషనర్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వెంపలి రాంబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కూటమి నాయకులు సహకారంతో కృషి చేస్తామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రాంబాబు

తాడిలో 'స్వచ్ఛ దివస్' ఎందుకు నిర్వహించలేదు

- గ్రామస్తులను రాంకీ కార్యక్రమానికి రమ్మనడం దర్మార్గం
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-పరవాడ

కాలుష్యకారక తాడి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాన్ కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ప్రశ్నించారు. ప్రతి నెల మూడవ శనివారం ఒక గ్రామంలో నిర్వహించాల్సి ఉందని, కానీ దీని విరుద్ధంగా తాడి ప్రజలందరినీ రాంకీ హబ్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి అధికారులు రమ్మని చెప్పడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. దీనిపై సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కాలుష్యకారకమైన గ్రామంలో నిర్వహించవలసిన స్వచ్ఛ దివాన్ కార్యక్రమం ఒక కార్పొరేట్ కంపెనీలో ఫార్మా డెవలపర్ దగ్గర నిర్వహించడం మంచిది కాదన్నారు. గ్రామంలో ప్రజలు తీవ్రమైన జబ్బులతో అల్లాడుతున్నారని, గ్రామాన్ని తరలిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో గ్రామంలో అభివృద్ధి లేదని పేర్కొన్నారు. ఫార్మా కాలుష్యం ఒకవైపు దోమలతో మరోవైపు ప్రజల అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాన్ని వెంటనే తరలించడానికి చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. పరిశ్రమల శాఖ అధికారులు పరిశ్రమల్లో నిర్వహిస్తారని, తాసిల్దార్ ఎంపీడీవోలు గ్రామాల్లో నిర్వహించాలని ప్రజల అభివృద్ధి కోసం ప్రజల ఆరోగ్యాల కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కండేపల్లి లక్ష్మి, పార్వతి, రమణమ్మ, తాడి ప్రజలు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న సిఐటియు నేత గనిశెట్టి, తాడి గ్రామస్తులు

ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని ఆలోచన విరమించుకోవాలని అనకాపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద గ్రేటర్ విశాఖ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఆప్కాస్ రద్దు చేసే ఆలోచన విరమించాలని, ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. శంకరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి, థర్డ్ పార్టీ కాంటాక్ట్‌కి ఇవ్వాలని ఆలోచన చేయడంతో కార్మికులు ఆందోళన గురవుతున్నారని పేర్కొన్నారు. దీని వలన ఆప్కాస్‌లో ఉన్న ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆప్కాస్ రద్దు చేసే ఆలోచన ఉంటే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఒక మాట, గెలిచిన తర్వాత మరొక మాట మాట్లాడడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఆప్కాస్ నిర్వహణకు కార్మికుల జీతాల నుండి ఒక శాతం కేటాయిస్తున్నారని, ఇప్పుడు మంత్రివర్గం థర్డ్ పార్టీ కాంటాక్ట్ ఇచ్చి కార్మికులు జీతాల నుండి నాలుగు శాతం కేటాయించాలని నిర్ణయించారని పేర్కొన్నారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 1500 కోట్ల రూపాయలు భారం పడబోతుందని, ఇది రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికే ఆప్కాస్ రద్దు చేస్తున్నారని విమర్శించారు. అందర్నీ తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అదనంగా 250 కార్మికులను పెంచాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కారం చేయాలని, లేకపోతే భవిష్యత్తులో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు యర్రంశెట్టి శివ కుమార్, నిమ్మకాయల అజయ్, నాయకులు మంగళగిరి సంతోష్, శింగంపల్లి నూకరాజు, బొమ్మాల రాము, వై.శ్రీను, జలగడుగుల వరప్రసాద్, సింగంపల్లి బుజ్జి, ఎస్. రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్షా సామగ్రి ఇస్తున్న సిఐ అప్పలరాజు తదితరులు

ప్రజాశక్తి-చోడవరం

ఎస్ఎన్‌డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పిఎస్ పేట జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని చోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.అప్పలరాజు చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా పదో తరగతి పరీక్షలు రాయాలన్నారు. చీడికాడ మండలం కోణం హైస్కూల్ విద్యార్థులకు కూడా సామాగ్రి పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సర్వారం గాంధీనగరం బీసీ హాస్టల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్లాంక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బి.సి హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు విద్యార్థులతో ఐక్యత స్వభావంతో ముందుకు సాగాలని సూచించారు. పరీక్షలు విజయవంతంగా రాయాలని సూచించారు.



పరీక్షా సామగ్రి ఇస్తున్న అబ్దుల్ కలాం సేవా సంఘం చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండల కేంద్రంలోని ఇంటర్ పరీక్షలు ఈ నెల 15వ తేదీతో ప్రశాంతంగా ముగిసినట్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ చీఫ్ సూపరింటెండెంట్ పి. సుభాషిణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ ఫస్టియర్ 306 మంది, ఇంటర్ సెకండియర్‌కు 323 మంది విద్యార్థులు పరీక్షలు రాసారని చెప్పారు. మండల కేంద్రంలో ఇంటర్ పరీక్షలకు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కాలేజ్‌లో పరీక్ష కేంద్రంలో ఇంటర్ ఫస్టియర్ 278 మంది ఇంటర్ సెకండ్ ఇయర్ 231 మంది ప్రైవేటుగా 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎన్. రామకృష్ణ తెలిపారు.

మాడుగుల: ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. శనివారం చివరి రోజు జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 396 మంది హాజరు కావలసి ఉండగా 14 మంది పరీక్షకు గైర్హాజర్లు కాగా 382 మంది పరీక్షకు హాజరయ్యారని ఇంటర్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ నీలిమా తెలిపారు. పరీక్షల నిర్వహణ ఏ విధంగా జరుగుతుందోనని ఫ్లైయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ చేశారు.

డైట్‌లో ఎన్‌సిటిసిటి-2కె25 జాతీయ సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సిఎస్ఈ విభాగం, సిఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటింగ్ టెక్నాలజీ -2కె25' అనే జాతీయ సదస్సు నిర్వహించారు. దీనికి ప్రత్యేక అతిథులుగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, గ్లోబల్ హెడ్ ఆఫ్ టెక్నాలజీ అడ్వైజరీ బాల ప్రసాద్, అసోసియేట్ డైరెక్టర్ యాక్సెంచర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ డాక్టర్ సురేష్ అడిగా, హెడ్ అకాడమిక్ అండ్ ఇండస్ట్రీ కౌన్సిల్, కంప్యూటర్ సొసైటీ అఫ్ ఇండియా, చీఫ్ స్ట్రాటజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, డెల్టా మార్చ్ టెక్నాలజీస్ చంద్రశేఖర్ దశక హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల ప్రసాద్ మాట్లాడుతూ గవర్నమెంట్ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ స్థాపించాలాన్నారు. డాక్టర్ సురేష్ అడిగా మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు తమ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. డైట్ చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ కంప్యూటర్ సొసైటీ అఫ్ ఇండియా మన దేశంలోనే కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగంలో అత్యుత్తమమైన ప్రొఫెషనల్ బాడీ అని, 2010 నుంచి డైట్‌లో చురుకుగా వుంటూ వివిధ అవార్డ్స్ కైవసం చేసుకుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, ఎన్‌సిటిసిటి కన్వీనర్ డాక్టర్ కె. సుజాత, ఎం శ్రీనివాసరావు, కెఎస్ ఈశ్వరరావు, డాక్టర్ పి పూర్ణ ప్రియ, బి సతీష్, పి భారతి, బి అంజనీ కుమార్, రమణ కుమార్ పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

పలుచోట్ల స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు


అనకాపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ కోరారు. మండలంలోని అన్ని పంచాయతీ గ్రామాల్లోనూ శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో నిర్వహించారు. ఉపమాక పంచాయతీ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంపీడీవో సీతారామరాజు, పంచాయతీ సర్పంచ్ ప్రగడ వీరబాబు, కార్యదర్శి జయప్రకాష్ ర్యాలీ, మానవహారం చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. తహసిల్దార్ నరసింహమూర్తి, వైద్యులు పాల్గొన్నారు.డిఎల్ పురంలో సర్పంచ్ కిల్లాడి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు కనకారావు, కో ఆప్షన్ సభ్యులు లొడగల చంద్రరావు ర్యాలీ నిర్వహించారు.

కోటవురట్ల:ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసిల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు కార్యాలయ ఆవరణలో పరిశుభ్రం చేశారు, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, సర్పంచ్ అనిల్ కుమార్, ఇన్చార్జి ఈఓపిఆర్డి రఘురాం పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చక్రవర్తి, పంచాయతీ సెక్రటరీ శ్రావణి, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, రాఘవ నాయుడు, వార్డు మెంబర్ కరణం రాంబాబు, విద్యా కమిటీ చైర్మన్ వసంత నాగేశ్వరరావు పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ మినిస్టేడియం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబీద్ సెంటర్ ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ మున్సిపల్ కమిషనర్ జంప సురేంద్ర , కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, చింతకాయల రాజేష్ ,జనసేన పార్టీ ఇంచార్జ్ వీర సూర్యచంద్ర పాల్గొన్నారు.

రోలుగుంట: స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, మండలం ప్రత్యేకాధికారి జి.మోహన్‌రావు, ఎంపిడిఒ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.రమేష్‌బాబు, హౌసింగ్ ఏఈ జీ.గణేష్‌రావు తదితరులు ర్యాలీ నిర్వహించారు.

అచ్యుతాపురంభవిష్యత్ తరాలు కలకాలం ఆరోగ్యంగా, సంతోషంగా జీవించేలా పరిశుభ్రమైన వాతావరణాన్ని వారికి అందించాలని జోనల్ పత్యేకాధికారి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ ఫ్రీ గ్రామంగా ప్రకటించిన ఎం. జగన్నాధపురం గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి అధికారి గిరీషా పిఎస్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, శాసనసభ్యులు సుందరపు విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. కాలువలలో పూడిక తీత, రోడ్లు శుభ్రంచేసే పనుల్లో వారు పాల్గొన్నారు. జ్యూట్ సంచులను ఇంటింటికి పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ షేక్ ఆయిషా, డిఆర్‌డిఎ పీడీ కె.శచీదేవి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటరు జిల్లా కో ఆర్డినేటరు ఇ.నాగలక్ష్మి, మహిళా,శిశు సంక్షేమశాఖ ప్రోజెక్టు డైరెక్టరు కె. అనంతలక్ష్మి, డిపిఒ ఆర్. శిరీషా రాణి, గ్రామ సర్పంచ్ కె. బుల్లెమ్మ పాల్గొన్నారు.

అనకాపల్లి : స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయ, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, డిఆర్‌ఒ సత్యనారాయణ రావు, జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం మండల పరిషత్ ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో సిఐ అప్పలరాజు ఎంపిడిఓ ఆంజనేయులు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ నూకాలమ్మ, ఇఒ నారాయణరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయలక్ష్మి ప్రారంభించారు. బుచ్చయ్యపేటలో ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి విజయలక్ష్మి, ఈవో లవరాజు, కేపీ అగ్రహారంలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ దేవర అప్పారావు పాల్గొన్నారు.

పరవాడ : గ్రేటర్ విశాఖ 79 వ వార్డు పరిధి లంకెల పాలెం జంక్షన్‌లో స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యాన షాపు యజమానులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. జంక్షన్లో ర్యాలీ చేశారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు పాల్గొన్నారు. ఎంపీడీవో పి.పద్మజ పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. సబ్ రిజిస్టర్ జిలాని గౌస్య బేగం శుభ్రం చేశారు. తహశీల్దారు బి. చిన్ని కృష్ణ, ఎంఈఓలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని చింతల పాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సుభాషిణి మొక్కలు నాటారు. తాళ్ళపాలెంలో ర్యాలీ చేశారు. ఎంపీడీఓ రవి కుమార్, సర్పంచ్ రెల్లి నాగయమ్మ, కూటమి పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, గుల్లేపల్లి గ్రామాలలో మండల ప్రత్యేకాధికారి, డూమా పిడి ఆర్.పూర్ణమదేవి పాల్గొని మాట్లాడారు. చౌడువాడ పిహెచ్‌సి వద్ద మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు. ఏపీవో అప్పలరాజు, ఎపిడి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ.:ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపే ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉందామని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్కే బీచ్ సమీపంలోని కాళీమాత ఆలయం వద్ద నిర్వహించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్ ర్యాలీని ప్రారంభించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు సోమన్నారాయణ, వర్మ, రమణ మూర్తి, సీఎంవో నరేశ్ పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విశాఖ తూర్పు నియోజకవర్గ ప్రజలంతా పాల్గొని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కోరారు. నగరంలోని జీవీఎంసీ పరిధిలోని 16వ వార్డులో నిర్వహించారు. జోన్ – 3 కమిషనర్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ: విఎంఆర్‌డిఎ పార్క్ లో ఛైర్పర్సన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రో పాలిటన్ కమీషనర్ కెఎస్ విశ్వనాథ గాయత్రి విద్యా పరిషత్తు స్కూల్ విద్యార్థినులతో కలిసి ఎంజిఎం లాన్ -1 బీచ్‌లో చెత్త, చెదారం తొలగించారు.సంయుక్త కమీషనర్ రమేష్, స్థానిక కార్పొరేటర్ నూకరత్నం, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్ భవానీశంకర్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శివానీ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్: కెజిహెచ్ లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా కెజిహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద మాట్లాడారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డి.రాధాకృష్ణన్, వైద్యులు వాసవిలత, వి.రవి, డిసిఎస్ ఆర్ఎంఒ జి.మెహర్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి ఎ.రాజేష్,నర్సింగ్ సూపరింటెండెంట్లు పద్మావతి. ఎన్.కల్పనా మౌళి, లత పాల్గొన్నారు.

సీతమ్మధార : స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్, డిప్యూటీ మేయర్ కె.సతీష్, కార్పొరేటర్లు ఉష శ్రీ, రాజశేఖర్, పాల్గొని, సామూహిక స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది తో డిఎంహెచ్ఒ పి.జగదీశ్వరరావు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక వికాస్‌నగర్ న్యూ ఐటీఐ ప్రాంగణంలో 65 వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు మొక్కలు నాటారు.ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జగదీష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో డిఇఒ ఎన్. ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. హెచ్ఎం గొట్టేటి రవి, ఉపాధ్యాయులు కోటాను శ్రీను, ప్రకాశ బాబు, పద్మావతి, వరలక్ష్మి, మోహనరావు, సునీత, పిడి లక్ష్మి స్వామి పాల్గొన్నారు

ఆరోవార్డు రాజీవ్‌గృహ కల్ప కాలనీ, ప్రధాన కూడలిలో స్వచ్ఛాంధ్ర ర్యాలీలో జివిఎంసి వైద్యాధికారి డాక్టర్ కిషోర్, కార్పొరేటర్ మొల్లి హేమలత, వార్డు అధ్యక్షులు దాసరి శ్రీనివాస్,గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, పాపారావు పాల్గొని ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

భీమునిపట్నం : మండలంలోని ఆర్‌తాళ్ళ వలసలో స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించారు. టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు, ఇఒపిఆర్‌డి రమేష్‌నాయుడు పాల్గొన్నారు. టి నగరపాలెంలో సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, ఎంపిడిఒఎన్ హనుమంత రావు, . సింగనబంద పంచాయితీ కృష్ణంరాజు పేట, తాటితూరు ప్రాథమిక పాఠశాలలు, లక్ష్మీపురం ఉన్నతపాఠశాలలో పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ పి శ్రీవాణి, అధ్యాపకులు మొక్కలు నాటారు. మూడో వార్డు గంటస్తంభం పరిసరాల్లో పరిశుభ్రత పనుల్లో జెడ్‌సి పిల్లి ప్రేమప్రసన్న వాణి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు,పాల్గొన్నారు.

కంచేరుపాలెంలో చిప్పాడ దివీస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో విశాఖ జోనల్ కార్యాలయం, ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ కరుణ రేఖ, ఇసిడి జనరల్ మేనేజర్

ములగాడ : 40వ వార్డు ఇఎస్ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కార్పొరేటర్ నాగేశ్వరరావు, ఆసుపత్రి సూపరెంటిండెంట్ డాక్టర్ బివి.రమణమూర్తి పాల్గొని మొక్కలు నాటారు. ఆర్ఎంఒ డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ సునీత, డాక్టర్ ఫణీంద్ర, నాగమణి పాల్గొన్నారు.

ఆనందపురం: వెల్లంకి పంచాయతీ కార్యాలయం, ఉన్నతపాఠశాలల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, కార్యదర్శి శ్రీరామమూర్తి పాల్గొన్నారు దిబ్బడిపాలెంలోఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. డిపిఒ డి శ్రీనివాస్, రవితేజ, ఎంపిడిఒ వి.జానకి పాల్గొన్నారు.

గోపాలపట్నం : స్థానిక రైతుబజారులో స్వచ్ఛాంధ్రలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొని, మొక్కలునాటారు. తహశీల్దార్ రమేష్, ఎఎంహెచ్ఒ అప్పలనాయుడు, ఇఒ ప్రసాద్ పాల్గొన్నారు. 89వ వార్డులో స్వచ్ఛభారత్‌లో కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ మొక్కలు నాటారు.

మాధవధార : 51వ వార్డు కార్పొరేటర్ ఆర్ వెంకటరమణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యకమంలో భాగంగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో పరిసర చిరువ్యాపారులు, ఈస్ట్ పార్కు వాకర్స్‌కు అవగాహన కల్పించారు. వార్డన్ గిరీశ్వరి, శ్యామల దేవి, నాయకులు ఎద్దు పైడిరాజు, శ్యామ్ పాల్గొన్నారు.

పద్మనాభం : మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ విజయకుమార్, కె.దామోదరరావు, టి నాగమణి, ఎం సోమేశ, కె.లక్ష్మీ నాయుడు. పాల్గొన్నారు.

అరిలోవ : విమ్స్‌లో డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు. విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఎఒ భాజిత్ పాల్గొన్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి నిర్వహించిన రథోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాల్లో భాగంగా పౌర్ణమి సందర్భంగా గ్రామ మాడవీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న ఉత్సవ మూర్తులను రథంలో వేయింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు.

శనివారం వెంకన్న ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పలు ప్రాంతంలో నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో అలరించింది.


స్థలాలను పరిశీలిస్తున్న ఎఇ

అర్హులను ఎంపిక చేయాలి

ప్రజాశక్తి- కోటవురట్ల:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించి తలపెట్టిన పీఎంఏవై 2.0 గృహ నిర్మాణాలకు అర్హుల ఎంపిక లో పూర్తి పారదర్శకంగా ఎంపిక చేయాలని మండల గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ వరప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన బోడపాలెం గ్రామంలో ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 628 లబ్ధిదారులను ఎంపిక చేయగా ఇంతవరకు 390 మంది వరకు అర్హులను గుర్తించి వారికి రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఎల్పీసీలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు.


హాల్ టికెట్లు ఇస్తున్న హెచ్ఎం

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి సూచించారు. విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకారాదన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాఠశాల నుంచి 80 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు.అనంతరం పాఠశాల విద్యార్థులందరికీ పరీక్షా మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -రావికమతం: మరుపాక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మరుపాక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 10వ తరగతి పూర్తి చేసుకుని 2025-26 ఏడాదికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్‌కు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఓసి, బిసి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులకు 150 రూపాయలు ఫీజు చెల్లించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అసైన్డ్ భూములను గిరిజనులకు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-మాడుగుల: శంకరం పంచాయతీలో అసైన్డ్ భూములు రీసర్వే చేసి అన్యాక్రాంతం అయిన భూములను గిరిజనులకు తిరిగి అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి ఇరట నరనరసింహమూర్తి, కె భవాని డిమాండ్ చేసారు. శనివారం క్రిష్ణం పాలెం, బోడ్డరేవు, మామిడి పాలెం తాడివలస, వెలగలపాడు కొత్తవలస, తాడివలస, గోప్పూరు, రాయిపాలెం, రాజాంపేట గిరిజన గ్రామాల్లో సిపిఎం నాయకులు పాదయాత్ర నిర్వహించారు. గిరిజనులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు, జిల్లాలోని ధనవంతలు, భూస్వాముల కన్ను ఈ పంచాయితీలో అసైన్డ్ భూములపై పడిందన్నారు. 99 సంవత్సరాల లీజు పేరుతో గిరిజనుల భూములు కాజేసి నట్లు సిపిఎం నాయకుల దృష్టికి గిరిజనులు తీసుకు వచ్చినట్లు తెలిపారు. అసైన్ భూములు అమ్మకాలు, కోనుగోలును ధనవంతలు అడ్డగోలుగా చేస్తున్నారన్నారు. అమ్మకాలు కోనుగోలు చేసినా నేరమన్నారు. ఈ పంచాయితీలో గతంలో రెవెన్యూ అధికారులు తప్పుడు సర్వే నెంబర్లుతో గిరిజనులకు పట్టాలు ఇచ్చారని, భూస్వాములు గిరిజనులను మోసం చేయడం సులువైయిందని తెలిపారు. మరోవైపు గిరిజనులు ఒకరి పేరున భూములు మరో ఒక్కరికి పట్టాలు పాస్ బుక్కులు తప్పులు పడ్డాయని తెలిపారు. దీనికి సరి చేయవలసిన రెవెన్యూ అధికారులు పూర్తిగా భూస్వాములకు సహకరించి గిరిజనులకు అన్యాయం చేశారని తెలిపారు. ఇప్పటికే ఈ పంచాయితీ లో 70 శాతం గిరిజనులు భూములు అన్యాక్రాంతం అయ్యాయని తెలిపారు. ఈ ప్రాంతాన్ని ఐదవ షెడ్యూల్డ్ లో చేర్చక పోవడంతో గిరిజన యువతి యువకులకు ఉపాది, ఉద్యోగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. కలెక్టర్ ఈ పంచాయితీ పై దృష్టి పెట్టి అసైన్ భూములు రీసర్వే జరిపి అన్యాక్రాంతం అయిన గిరిజనుల భూములను తిరిగి అప్పగించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో. సోలం మంగ, గిన్నెపల్లి సన్యాసమ్మ, కోర్ర దేవదాసు, సోమల నరసింగరావు, ఇరట దేముడు, వంతాల రాజారావు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు



చెక్కులు పంపిణీ చేస్తున్న అయ్యన్న

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పలువురు లబ్ధిదారులకు అందజేశారు. నాతవరం మండలం ఎంబి.పట్నం గ్రామానికి చెందిన నిరుద్యోగి రాజు రూ.1,00,825, నాతవరం గ్రామానికి చెందిన శెట్టి శ్రీనివాసరావు రూ.53,250, మాకవరపాలెం మండలం సీతన్నఅగ్రహారం గ్రామానికి చెందిన పల్ల గౌతం రూ.50వేలు, మాకవరపాలెం మండలం బూరుగుపాలెం గ్రామానికి చెందిన చిటికెల సత్తిబాబు రూ.24,100 చెక్కులను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ఆరు నెలల కాలంలో నియోజకవర్గంలోని 22 మందికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించగలిగామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



బహుమతులు ఇస్తున్న ఎస్ఐ

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -అనకాపల్లి డెస్క్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గత నెల 22న యస్ రాయవరం మండలం అడ్డురోడ్డులో కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన మోడల్ పరీక్షల విజేతలకు శనివారం బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సీఐ ఎల్ .రామకృష్ణ విచ్చేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడంతో వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, గంజాయి, మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా ప్రభావానికి గురి కాకూడదని బాగా చదువుకోవాలని ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ మాట్లాడుతూ విద్యార్థులు చెడు మార్గాలకు వెళ్లకుండా ఎస్ఎఫ్ఐ అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ కల్పన పాల్గొన్నారు .

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యులు కాశీనాయుడు అన్నారు, శనివారం తమ నివాసం వద్ద మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను ఆధ్వర్యంలో మండల తెదేపా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కాశీనాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కార్యకర్తలతో సమీక్షించారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు చర్యలు చేపడుతున్నట్లు సందర్భంలో తెలిపారు. జానకి శ్రీను మాట్లాడుతూ, అర్హులందరికీ అభివృద్ధి ఫలాలు అందే విధంగా గ్రామ స్థాయి నాయకులు చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వేచలపు జనార్ధన్, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, సర్పంచ్ లింగన్న నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేత శరభన్నకు కన్నీటి వీడ్కోలు

తరలివచ్చిన పలు పార్టీల నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-పెదబయలు : గిరిజన ఉద్యమ నేత, సిపిఎం పెదబయలు మండల నాయకులు కిల్లో శరభన్న అంత్యక్రియకులు నాయకులు, ప్రజలు తరలి వచ్చారు. అనారోగ్యం తో మృతి చెందిన విషయం తెలిసిందే. శరభన్న అంతిమ యాత్రలో సిపిఎం మండల కార్యదర్శి సన్నిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. బ శరబన్న మృతి సిపిఎం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్ష ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో అడుగుల పుట్టు పంచాయతీ వడ్డెపుట్టు గ్రామంలో శనివారం శరభన్న అంతిమ యాత్రకు భారీగా తరలి వచ్చి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి, అప్పల నర్స మాట్లాడుతూ పెదబయలు మండలంలో గిరిజనుల సమస్యల పట్ల గత 15 సంవత్సరాలు ఆదివాసులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటాలు నిర్వహించారని కొనియారు. ఆయన మృతి గిరిజన ఉద్యమానికి, సిపిఎం పార్టీకి తీరని లోటని అన్నారు. గిరిజన సమస్యల పట్ల అనేక పోరాటాలు చేసిన ఘనత శరభన్నకి దక్కిందన్నారు, గిరిజనులకు పోడు భూమి పట్టాలు, గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మంచినీరు సౌకర్యం కల్పించాలని, పి,వి, టీ,జీలకు అంత్యోదయ కార్డులు, మారుమూల ప్రాంతాల్లో రహదారి సౌకర్యం కల్పించాలని, పి వి టి జి లకు 30 కేజీలు బియ్యం ఇవ్వాలని అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. అరకు, డుంబ్రిగుడ, పాడేరు, ముంచింగి పుట్టు సిపిఎం నాయకులు మృత దేహానికి నివాళులు అర్పించారు. సన్నిబాబు మాట్లాడుతూ, ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అనంతగిరి జడ్పీటీసీ గంగరాజు, సన్నిబాబు, ఉమామహేశ్వర్‌రావు, హైమావతి, పాలికి లక్కు, లింగరి సుందర్రావు, సాగిన ధర్మన్న పడల్, బాలదేవ్ నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, అప్పారావు బిజెపి నాయకులు పాంగి రామయ్య, మాజీ ఎంపీటీసీ లు సర్పంచులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.



పాడె మోస్తున్న అప్పలనర్స, గంగరాజు, తదితరులు



శరభన్న పార్థివదేహాన్ని చూసేందుకు భారీగా తరలివచ్చిన గిరిజనులు

ఇంటి పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి-కొత్తకోట గ్రామ పంచాయితీ అభివృద్ధికి ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి సహకరించాలని పంచాయతీ ఈవో జ్యోతిరెడ్డి కోరారు. శనివారం గ్రామంలో పలువురు గృహ యజమానులను కలిసి ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని, తద్వారా గ్రామాభివృద్ధికి తమ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామం లో ఇంటి పన్నుల చెల్లింపు లో పలువురు నిర్లక్ష్యం గా వ్యవరిస్తున్నారని, వేల రూపాయిలు బకాయిలు చెల్లించకుండా కాల యాపన చేస్తున్నారని పేర్కొన్నారు. గత రెండేళు గా 2022-23తో పాటు 2023-24 ఏడాదిలలో బకాయి పడ్డ సుమారు రూ.10 లక్షలతో పాటు ఈ ఏడాది 2024-25 మరో రూ 13 లక్షల ఇంటి పన్ను లు వసూళ్లకు ఐదు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మార్చి నెల అఖరికి సుమారు రూ 20 లక్షలు వసూళ్ల కు ప్రణాళిక సిద్ధం చేశామని ఈవో తెలిపారు. మొండి బకా దారులకు తొలి విడత నోటిస్ జారీ చేస్తామని, అప్పటి స్పందించకుంటే మౌళిక సదుపాయాలు నిలుపు చేస్తామని హెచ్చరించారు.



గేదెలను ఇస్తున్న సత్యనారాయణ

పాడి రైతుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: పాడి రైతులని అభివృద్ధి బాటలో తీసుకెళ్లేందుకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ కృషి చేస్తున్నారని డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన విశాఖ డైరీ నుండి కొనుగోలు చేసిన హర్యానా ముర్రా గేదలను రైతులకు అందశారు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోటి రూపాయలు తో 100 పశువులను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క రైతుకు 70 వేలు లోన్ రూపంలో, 15 వేలు సబ్సిడీతో, పాటు హర్యానా నుంచి విశాఖ వరకూ ట్రాన్స్పోర్ట్ ఉచితంగా ఇచ్చి రైతులకు అండగా నిలిచినట్లు తెలిపారు. .గతంలో ఆవు పాల రేట్ గిట్టుబాటు అవ్వలేదని రైతులు తెలపడం తో హర్యానా, ముర్రా గేదలను కొనుగోలు చేసి రైతు కుటుంబాలకు విశాఖ డైరీ భరోసాని ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అభిషేక్ పాల్గొన్నారు.

మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ఇండస్ట్రీ కనెక్ట్ సదస్సులో ముత్తంశెట్టి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకొని దానికి అనుగుణంగా అవకాశాలు అంది పుచ్చుకునేలా విద్యార్థులు ఎదగాలని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం నర్సీపట్నంలో ఇండస్ట్రీస్ కనెక్ట్ పేరుతో హ్యూమన్ రిసోర్స్ నిర్వాహణ అధికారులు, ఇంజనీరింగ్ విద్యార్థులతో కలిపి ప్రత్యేకత సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మానవ జీవన పరిణామ క్రమంలో సాంకేతికంగా ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ఈ మార్పులు వచ్చినప్పుడు అపారమైన అవకాశాలతో పాటు కొందరికి అవకాశాలు కూడా కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. భవిష్యత్తులో ఏఐ టెక్నాలజీలో అపారమైన అవకాశాలు రాబోతున్నాయన్నారు. భవిష్యత్తు ఏఐ. టెక్నాలజీదే అని వివరించారు. అందుకే మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, విప్లవాన్ని అర్థం చేసుకొని విద్యార్థులు ఎదగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన విద్యావేత్తల ప్రసంగించారు.

ముత్తంశెట్టి నోట అయ్యన్న మాట

ముత్తంశెట్టి శ్రీనివాసరావు నోట అయ్యన్న మాట వచ్చింది. ఈరోజు జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అవంతి ఇంజనీరింగ్ కళాశాలను ఇక్కడ తీసుకు రావడానికి గల కారణం ప్రధానంగా సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడే అని అన్నారు. అయ్యన్నపాత్రుడు తనకు మంచి మిత్రుడు అని ఆయన తెలియజేశారు.